క్లుప్తంగా

రూ. 9.5 లక్షలతో కాలువ, సీసీ రోడ్ల నిర్మాణం


చినకాద గ్రామంలో నిర్మించిన సీసీ కాలువ

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో రెండు రోజులుగా చేపడుతున్న మూడు సీసీ రోడ్లు, కాలువ నిర్మాణ పనులు మంగళవారంతో ముగిశాయని సర్పంచ్ ఆవుగడ్డి ఈశ్వరమ్మ తెలిపారు. గ్రామంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ' గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు సీసీ రోడ్లు, కాలువ నిర్మించాలని కోరడంతో రూ.9.50 లక్షలు మంజూరు చేశారని సర్పంచ్ చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందనిఅన్నారు. రోడ్లు, సీసీ కాలువ నిర్మించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: స్థానిక సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ జి.శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రహదారి విస్తరణలో భాగంగా గజపతినగరం 11 కేవీ టౌన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం


పెదమానాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజేశ్వరి, జేఈ ధనుంజయ్

దత్తిరాజేరు: పెదమానాపురంలో కోళ్లవీధిలో తాగునీటి సమస్యను కొద్దిరోజుల్లో పరిష్కరించనున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ధనుంజయ్ తెలిపారు. కోళ్ల వీధిలో 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. తాగునీటి కోసం ఇక్కడి మహిళలు రోడ్డు దాటి కొద్ది దూరం వెళ్లాల్సి వస్తోంది. కొద్దిరోజుల క్రితం గ్రామానికి వచ్చిన జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరికి మహిళలు సమస్యను వివరించారు. దీంతో సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ధనుంజయ్‌తో కలిసి జెడ్పీటీసీ ఆ గ్రామంలో మంగళవారం పర్యటించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ తాగునీటి పథకం నుంచి కోళ్లవీధికి పైపులు వేస్తామని తెలిపారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు


భోగి మంట చుట్టూ నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

గుర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో సంబరాల్లో పాల్గొన్నారు. భోగి మంటను వెలి గించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు.

నేడు ఉత్తరాంధ్ర స్థాయి షటిల్ టోర్నీ

శృంగవరపుకోట: స్థానిక స్పార్టన్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రాంగణంలో బుధవారం రాత్రి ఉత్తరాంధ్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న వాలీబాల్ పోటీలు


పోటీలో తలపడుతున్న గొల్లలపాలెం, అర్థన్నపాలెం జట్లు

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శారద మెటల్స్ అండ్ ఎల్లోయిస్ లిమిటెడ్ కర్మాగారం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ పోటీలు రెండోరోజు మంగళవారం ఉత్కంఠ భరితంగా సాగాయి. 34 జట్లకు లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహించగా తుది పోరుకు నాలుగు జట్లు అర్హత సాధించాయని రిఫరీ యు.కృష్ణంరాజు తెలిపారు. బుధవారం నిర్వహించనున్న ఫైనల్స్‌లో గులివిందాడ,తుమ్మికాపల్లి జట్లు తలపడనున్నాయి. అలాగే మూడు, నాలుగు స్థానాలకు గొల్లలపాలెం, అర్థన్నపాలెం జట్లు తలపడనున్నాయి. గెలుపొందిన జట్లుకు నగదు బహుమతి, ట్రోఫీను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతులమీదగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శారద కర్మాగార ప్రతినిధులు గుల్లిపల్లి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ సిద్ధాంతం


కొత్తవలస రూరల్: దత్తి గ్రామంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


వేపాడ: సోంపురంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు


వేపాడ: కోలాటంతో ఎమ్మెల్యే కడుబండికి స్వాగతం పలుకుతున్న సోంపురం గ్రామస్తులు

కొత్తవలస రూరల్: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధాంతమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు. దత్తి గ్రామంలో మంగళవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ పేదవాడు సంతోషంగా జీవించాల న్నదే తమ ప్రభుత్వ ఉద్దేశ్యమని, పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. విద్య,వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, ఇక్కడి విధానాలను ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు. స్థానిక సర్పంచ్ కోన దేముడు, నాయకులు పి.ఎస్.ఎన్.పాత్రుడు, కొట్యాడ శ్రీనివాసరావు, ఆతవ రమేష్, జామి సాల్మాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సోంపురంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యేకు సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ గజమాలవేసి మహిళా కోలాటం, కాంగో నృత్యాలతో ఘనస్వాగతం పలికారు. గ్రామంలో ప్రతీ ఇంటి ముందు రంగవళ్లులతో వెల్‌కమ్ తెలిపారు. గ్రామంలోని రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు, చర్చికి వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింట కుళాయిల ఏర్పాటుకు నిధులు సమకూర్చుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఎంపీడీఓ పట్నాయక్, వైస్‌ఎంపీపీ అడపా ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, నెడ్ క్యాప్ డైరెక్టర్ సీహెచ్.పద్మావతి, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు బోజంకి శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, నాయకులు, పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

- నియోజకవర్గంలో 42 ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు, ఆలయాల అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నిధులు కేటాయించడం చరిత్రలో ఇదే తొలిశారని, ఇదంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గొప్పతనమని చెప్పారు. చీపురుపల్లి నియోజకవర్గంలో 42 ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాని, ఇందులో చీపురుపల్లి మండలంలోనే 13 ఉన్నాయని చెప్పారు. ఒక్కో ఆలయం అభివృద్ధికి రూ.10 లక్షలు చొప్పున దేవదాయశాఖ ఆధ్వర్యంలో టీటీడీ నుంచి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరైన ఆలయాలను పరిశీలించేందుకు టీటీడీ, దేవదాయశాఖ అధికారులు బుధవారం నుంచి పర్యటించనున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు పతివాడ రాజారావు, బాణాన శ్రీను, బాణాన రమణ పాల్గొన్నారు.

ధాన్యం తరలింపులో ఇబ్బందులు తలెత్తకూడదు


రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి

గంట్యాడ: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల(ఆర్బీకే) నుంచి మిల్లులకు తరలించడంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి ఆర్బీకేల సిబ్బందికి సూచించారు. మండలంలోని నరవ, లక్కిడాం ఆర్బీకేలను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి ధాన్యం విక్రయించుకునేందుకు ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. అలాగే సిబ్బందితో మాట్లాడి ధాన్యం సేకరణ వివరిలు తెలుసుకున్నారు. అనంతరం కొఠారుబిల్లి జంక్షన్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర రైస్ మిల్లులో తనిఖీలు చేశారు. ఆర్బీకేల్లో తూకం చేసి పంపించిన ధాన్యం కంటే రైతుల నుంచి అదనంగా ధాన్యం అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఆర్బీకే నుంచి వాహనాలతో ధాన్యం రాగానే అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ నాగభూషణం, ఏఓ బి.శ్యామ్‌కుమార్ ఉన్నారు.

ఏఐకేఎంఎస్ గ్రామసభ


మాట్లాడుతున్న ఆశిష్‌మిట్టల్

శృంగవరపుకోట: ప్రపంచవ్యాప్తంగా భూములు-అడవులు, జలవనరులను కాజేయాలని చూస్తున్న కార్పొరేట్లకు, ప్రజలకి మధ్య యుద్ధాలు సాగుతున్నాయని ఏఐకేఎంఎస్ (ఆలిండియా కిసాన్ మజ్దూర్ సంఘ్) ప్రధాన కార్యదర్శి ఆశిష్‌మిట్టల్ అన్నారు. మండలంలోని కొత్తఅద్దతీగల గ్రామంలో మంగళవారం అఖిల భారత రైతు-కూలీ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘాల ఆధ్వర్యంలో జిందాల్ బాధిత రైతాంగ సదస్సును వి.మల్లేష్, ఎస్.వెంకటలక్ష్మిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో ఆశిష్‌మిట్టల్ మాట్లాడుతూ దేశంలోని సంప్రదాయ ఆదివాసీల జీవనాన్ని నాశనం చేయాలని ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, అడవులు, సముద్ర తీరాలు, పంట భూముల్ని దోచే కుట్ర సాగుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు, పోలీసులు కార్పొరేట్లకు దన్నుగా నిలుస్తూ, అదే సమయంలో ఇక్కడ జిందాల్ పేరిట భూములు లాక్కున్నారని చెప్పారు. వృత్తుల్ని దెబ్బతీసే కుట్రలను గిరిజనులు అడ్డుకుంటున్నారని, ఒడిశా నుంచి ఆరంభమైన భూదోపిడీ నేడు దేశమంతటా ఉందన్నారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ చేయిచేయి కలిపి జిందాల్ భూముల కోసం పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, దళితవిముక్తి కన్వీనర్ ఎస్వీ రమణ, అరుణోదయ కార్యవర్గ సభ్యురాలు కె.నిర్మల, బాక్సైట్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు ఊళం పార్వతి, ఊళం మల్లేశ్వరరావు, కాకి దేముడమ్మ తదితరులు గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు.

ఘనంగా కొట్నాల ఉత్సవం


కొట్నాల ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారిని మంగళవారం పెళ్లి కుమార్తెను చేసి, కొట్నాల ఉత్సవం(పసుపు దంచుట) ఘనంగా నిర్వహించారు. పలువురు ముత్తయిదువులు పసుపు దంచారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే అన్నంరాజుపేట వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక


ప్రజావేదికలో అధికారులు, ప్రజాప్రతినిధులు

మెరకముడిదాం: మండలం పరిధిలో 2020-2021, 2021-2022 ఆర్థిక సంవత్సరాలలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహించిన పనులకు సంబంధించి ఇటీవల సామాజిక తనిఖీ బృందం ఇటీవల ఆడిట్ చేసింది. సంబంధిత ఆడిట్ నివేదికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆడిట్ ప్రొసీడింగ్ అధికారి టి.జనార్దన్, డీవీఓ రవీంద్ర, ఏపీడీ పి.రాధ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. ఎస్ఆర్పీలు ఏ.వెంకటరమణ, చిరంజీవి మాట్లాడుతూ 2022-21,2021-22 ఆర్థిక సంవత్సరాల్లో రూ.49.60 కోట్లతో చేపట్టిన 1,730 పనులపై ఆడిట్ నిర్వహించామని చెప్పారు. ఆడిట్ బృంద సభ్యులు మాట్లాడుతూ పలు గ్రామాల్లో మస్టర్ల సీట్లలో దిద్దుబాట్లు గుర్తించామని, సంబంధిత వేతనదారుల ఇళ్లకు వెళ్లి పనులకు వెళ్లారా లేదా అని ఆరా తీయగా తాము పనికి వెళ్లామని వారు చెప్పారని వివరించారు. పతివాడపేటకు వెళ్లే రోడ్డులో 300 కుపైగా మొక్కలు నాటగా 120 చనిపోయినట్లు గుర్తించామని డీఆర్పీలు చెప్పారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఏపీఓ పెదఅప్పలనాయుడు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎ స్.ఆర్.కె.ప్రసాద్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎల్.కోటలో ఉచిత వైద్యశిబిరం రేపు

లక్కవరపుకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నానికి చెందిన ఓమ్నీ ఆర్కే ఆస్పత్రి సౌజన్యంతో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యతనిఖీలతో పాటు చిన్నారులకు వైద్యసేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి


సోంపురం సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: గ్రామ సచివాలయాల సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు తక్షణం పరిష్కారం చూపాలని ఎంపీడీఓ పట్నాయక్ సూచించారు. మండలంలోని సోంపురం, ఆతవ గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఉద్యోగు ల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ-సర్వీసులను పెంచాలని సిబ్బందికి సూచించారు. ఆతవ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని గర్భిణులు, బాలింతలను ఆరా తీశారు. అనంతరం ఆ గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

వేపాడ: మన బడి నాడు-నేడు పథకం రెండో విడతలో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఎంఈఓ జి.శ్రీదేవి మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో పనుల ప్రగతిపై ఆరా తీశారు. త్వరిగతిని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంఘాలను ఏ-గ్రేడ్‌లో నిలపాలి

కొత్తవలస: డ్వాక్రా సంఘాలన్ని ఏ-గ్రేడ్ సాధించేలా గ్రామైక్య సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని లక్కవరపుకోట, కొత్తవలస వెలుగు ఏపీఎంలు అప్పలనాయుడు, శ్రీనివాసరావు సూచించారు. ఆయా మండల కేంద్రాల్లోని వెలుగు కార్యాలయాల్లో గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. సంఘాలకు రుణాల మంజూరు చేయించడంతో పాటు వాటిని తిరిగి సకాలంలో చెల్లించేలా, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చూడాలని సూచించారు.

పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్

బొండపల్లి: కౌమార బాలికలు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రతా మంలోనూ సఖి గ్రూపుల్లోని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి డి.వి.ఎల్.దుర్గాప్రసాద్ సూచించారు. సఖి గ్రూపుల ఏర్పాటు ఉద్దేశం, సభ్యుల విధులపై స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఏ.వేదవతి, గంట్యాడ ఐసీడీఎస్ పీఓ డి.ఉమాభారతి, దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ

చీపురుపల్లి: మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళదామని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు.ముందుగా శాఖల వారీగా ప్రగతి, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. వైద్యం, విద్య, ఆరోగ్యం, తాగు నీరు, రహదారులు, ఉపాధి హామీ తదితర శాఖల వారీగా పురోగతిపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ స్థాయి అధికార యంత్రాంగం నిత్యం ప్రజలకు చేరువగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో తోటపల్లి ప్రధాన కాలువ మరమ్మతులకు అవసరమైన ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జి.ములగాం సర్పంచ్ కరిమజ్జి శ్రీనివాసరావు కోరగా.. ఎంపీపీ స్పందిస్తూ ప్రహరీలు లేని పాఠశాలలను గుర్తించి, నిర్మాణాలకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైస్ ఎంపీపీలు పతివాడ లక్ష్మి, కరిమజ్జి వెంకటరమణమ్మ, డీఎల్‌డీఓ లక్ష్మణరావు, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మృతదేహంతో ఆందోళన

- మృతుని కుటుంబానికి రూ.8 లక్షల ఆర్థిక సాయం అందజేతకు ఒప్పందం


మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు, గ్రామస్తులు

కొత్తవలస రూరల్: మండలంలో చీపురువలస గ్రామానికి చెందిన కలిగట్ల కనక సూర్య సుబ్రహ్మణ్యం(52) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో పాల్గొన్న బొలెరో వాహనం కొత్తవలస నుంచి చీపురువలస స్వగ్రామానికి చేరుకుంటున్న సూరి సుబ్రహ్మణ్యంను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదానికి కారణమైన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పనులు నిర్వహిస్తున్న ఎస్‌కేసీ ప్రాజెక్టుకు చెందిన బొలెరో వాహనదారులుపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబంతో పాటూ రెండు గ్రామాలకు చెందిన ప్రజలు ప్రాజెక్టు నిర్మాణ కార్యాలయం ఎదుట మృతుని శవాన్ని ఉంచి మంగళవారం ధర్నా చేశారు. ప్రాజెక్టు యాజమాన్య ప్రతినిధులు కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, గ్రామ పెద్దలతో చర్చలు జరిపి కుటుంబానికి రూ.8 లక్షలు నష్టపరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని గ్రామంలోకి తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు.

'భవిత' సేవలను వినియోగించుకోవాలి


ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న ఎంఈఓ భానుప్రకాష్

చీపురుపల్లి: దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా భవిత కేంద్రాలను నిర్వహిస్తోందని, ఈ కేంద్రాల సేవలను దివ్యాంగ పిల్లలు వినియో గించుకునేలా వారి తల్లిదండ్రులు చూడాలని ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ సూచించారు. పట్టణంలోని పోలీస్ లైన్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అక్కడి దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలతో పాటు, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, ఎలాంటి వ్యాయామ చికిత్స సేవలు అందుతున్నాయి, పిల్లల్లో మానసిక పరివర్తన తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లలు మానసికంగా ఎదుగుదల సాధించాలనే ఆశయంతోనే ప్రభుత్వం భవిత కేంద్రాలు నిర్వహిస్తోందని చెప్పారు. దివ్యాంగులైన పిల్లలను ఇంటిలో ఉంచకుండా తప్పనిసరిగా భవిత కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఫిజియోథెరపిస్ట్ ఎల్.చంద్రసుధ, ఐఈఆర్పీలు త్రినాథరావు, సత్యనారాయణ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ శంకర్, పాఠశాల హెచ్‌ఎం ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

రూ.80 వేల సీఎం సహాయ నిధి అందజేత


బాధితురాలుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట సంజీవిని అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు. లక్కవరపుకోట మండలం దాసుళ్ల పాలెం గ్రామానికి చెందిన రామెల్ల చిన్న అనే మహిళ వెన్నెముక సమస్యతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులకు వారు పడుతున్న ఇబ్బందులను ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ముమ్మన ప్రసాదరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో సీఎం సహాయనిధి నుంచి బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 80 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును ఎమ్మెల్యే కొత్తవలసలోని తన క్యాంపు ఆఫీస్‌లో బాధితురాలికి మంగళవారం అందజేశారు. ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.త్రిమూర్తులు, ఎం.సూరిబాబు, కె.అప్పలరాజు, కె.నూకరాజు పాల్గొన్నారు.

'ఆడారి' మృతి పాడిరైతులకు తీరనిలోటు


తులసీరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డెయిరీ ఉద్యోగులు

శృంగవరపుకోట: విశాఖ డెయిరీ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించి, ఆంధ్రా కురియన్‌గా పేరు గాంచిన ఆడారి తులసీరావు మరణం ఉత్తరాంధ్ర పాడి రైతులకు తీరనిలోటని ఎస్.కోట డెయిరీ యూనిట్ మేనేజర్ బి.శివాజీరావు అన్నారు. మండలంలోని శివరామరాజుపేట రోడ్డులోని యూనిట్ ఆఫీస్‌లో శృంగవరపుకోట, వేపాడ బీసీసీల్లో (బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్) పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల వేతన కార్యదర్శులు, ఉద్యోగులు, డెయిరీ సిబ్బంది కలిసి శివాజీరావు నేతృత్వంలో తులసీరావు సంతాపసభను మంగళవారం నిర్వహించారు. తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శివాజీ రావు మాట్లాడుతూ విశాఖ డెయిరీఅభివృద్ధికి తులసీరావు ఎనలేని కృషి చేశారని అన్నారు. పాడి రైతుల కుటుంబాలకు విద్య, ఆరోగ్య, వైద్యం, గ్రామాల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి, బ్రిడ్జిలు నిర్మాణం తదితర కార్యక్రమాలను వేల సంఖ్యలో చేశారని గుర్తు చేశారు. డెయిరీ సూపర్‌వైజర్లు నాయుడు, బాబు, మధు, మహేష్, సురేష్, కాంట్రేగుల సన్యాసినాయుడు, ఒబ్బిన రమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు అర్హత


బొండపల్లి: రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన గొట్లాం విద్యార్థులతో ఉపాధ్యాయులు


దత్తిరాజేరు: రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన గడసాం విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ పోటీలకు అండర్-19 విభాగంలో గొట్లాం ఉన్నత పాఠశాల నుంచి అయిదు గురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీడీ యు.సత్యానంద్, హెచ్‌ఎం శ్రీరామాచారి మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వ హించిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు జి.సాయి.కె.ఊర్మిళ, రేష్మ, స్పందన, భాగ్యలక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబరిచి త్వరలో నెల్లూరు జిల్లా ఆత్మ కూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారు.

గడసాం పాఠశాల నుంచి ఎనిమిది మంది

దత్తిరాజేరు: గడసాం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వ్యాయామ ఉపాధ్యాయుడు గురునాయుడు మంగళవారం తెలిపారు. అండర్-17 విభాగం వాలీబాల్ పోటీలకు మల్లేశ్వరి, నెట్‌బాల్ పోటీలకు గంగ, వాసవి, జాహ్నవి, మహేశ్వరి ఎంపిక కాగా.. అండర్-14 విభాగం 300 మీటర్ల పరుగు పోటీలకు లావణ్య, స్విమ్మింగ్‌కు సురేష్ ఎంపికయ్యారు. వీరిని సర్పంచ్ నేతేటి దీపిక,హెచ్‌ఎం నాగమణి,ఉపాధ్యాయులు అభినందించారు.